

ఎయిడ్స్ నివారణపై అవగాహన అవసరం

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్
- పార్వతీపురంలో 5కే రన్
- ఉత్సాహంగా పాల్గొన్న ప్రజలు, అధికారులు



6లో

ఆ క్షణం ఆగితే..



- జీవితం విలువైనది.. దానిని కాపాడుకుందాం..
- బతికుంటే ఏదైనా సాధించొచ్చు
- చిన్న చిన్న సమస్యలకు బలవన్మరణానికి పాల్పడడం తగదు

- వ్యక్తిగత కారణాలతో గరుగుబిల్లి మండలం చినగుడబ సచివాలయ ఉద్యోగి ఇటీవల స్వగ్రామం దుప్పల పూడిలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు.
- భార్య దూరమైందనే బాధతో 20 రోజుల కిందట సాలూరులో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు.
- ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, రుణ యాప్‌ల కారణంగా అప్పులపాలై పాచిపెంట మండలానికి చెందిన ఓ యువకుడు కొద్దినెలల కిందట జీగిరాం సమీపంలో పురుగు మందు తాగి ప్రాణాలు తీసుకున్నాడు.

సాలూరు రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి):

.. ఇలా చిన్న చిన్న సమస్యలు, పలు కారణాలతో జిల్లాలో ఎంతోమంది ఆత్మహత్య చేసుకుంటున్నారు. కన్నవారికి, కట్టుకున్న వారికి తీరని శోకం మిగులుస్తున్నారు. క్షణికావేశంలో బంగారు జీవితాన్ని బలి చేసుకుని కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి విజయనగరం జిల్లాలో 186 మంది ఆత్మహత్య చేసుకున్నారు. వారిలో యువత అధిక సంఖ్యలో ఉండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఉన్నది ఒకటే జీవితం. దానిని కాపాడుకోవాలి. క్షణికావేశంలో అమూల్యమైన జీవితాన్ని చేజేతులా కాల్చుకుంటే.. అక్కడితోనే కథ ముగిసిపోతుంది. అందుకే బతికుండి ఏదైనా సాధించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆత్మహత్యలను నివారించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెబుతున్నారు.



మార్పులు గమనించాలి..

'ఆత్మహత్య చేసుకోవాలనుకునే వారి ప్రవర్తనలో మార్పులను కుటుంబ సభ్యులు గమనించాలి. ప్రవర్తనలో మార్పులు వచ్చిన వారికి సైకాలజిస్ట్‌తో కౌన్సెలింగ్ ఇవ్వాలి. జీవన విలువలు, నైపుణ్యాలు తెలియజేయాలి. జీవితం విలువ చెప్పాలి. బతికి సాధించొచ్చనే ఆత్మవిశ్వాసం కలిగించాలి. కుటుంబాల మధ్య అన్యోన్యత పెరగాలి. కుటుంబం జీవన విధానంపై అందరికి అవగాహన ఉండాలి. సమస్యలను పెద్దవిగా చూడకూడదు. ప్రాణం విలువ ప్రతిఒక్కరూ తెలుసుకోవాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి.' ఏపీ కౌన్సెలింగ్ సైకాలజిస్టల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ ఏవీ రాజశేఖర్ తెలిపారు.



మా కడుపుకోత ఎవరికీ రాకూడదు

'యాప్‌లో అప్పులు, ఆన్‌లైన్ బెట్టింగ్‌ల కారణంగా మా కొడుకు గంజి నాగరాజు ఆత్మహత్య చేసుకుని మాకు కడుపుకోత మిగిల్చాడు. పెద్ద కొడుకు దుబాయిలో సూపర్‌వైజర్ ఉద్యోగం చేన్నాడు. మా వద్ద ఉండి హోటల్ పనికి సాయమందించే చిన్నకొడుకు చనిపోయి మాకు దూరమయ్యాడు. వాడి ప్రవర్తనను గమనించకపోవడం మా తప్పే. మా కొడుపు కోత ఇంకేవరికీ రాకూడదు.' అని పాచిపెంట మండలం పణుకువలసకు చెందిన గంజి ఆదినారాయణ, సరస్వతి దంపతులు తెలిపారు.



నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా ప్రత్యేక కథనం 6లో

వానొస్తే కష్టమే!

- వర్షాల సమయంలో ప్రమాదకరంగా వాగులు, గెడ్డలు
- పలు గ్రామాల మధ్య రాకపోకలు బంద్
- వరద ఉధృతికి ప్రాణాలు కోల్పోతున్న వారెందరో..
- మూగజీవాలూ మృత్యువాత
- శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజల విన్నపం



ఉధృతంగా ప్రవహిస్తున్న రావాడగెడ్డ

పాలకొండ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): తుపాన్లు, భారీ వర్షాల సమయంలో జిల్లాలో కొండవాగులు, గెడ్డలు ప్రమాదకరంగా మారుతున్నాయి. వరద ఉధృతి కారణంగా పలు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభిస్తున్నాయి. ఒక్కోసారి గ్రామస్థులు గెడ్డ వాగుల్లో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోతున్నారు. పశువులు కూడా మృత్యువాత పడుతున్నాయి. దీంతో వానొస్తే చాలు.. ఆయా ప్రాంతవాసులు వణికిపోతున్నారు. అత్యవసర పనులపై బయటకు వెళ్లిన వారు గెడ్డ, వాగులను దాటే సాహసం చేయలేక.. స్వగ్రామాలకు చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాలకు వెళ్లే రైతులు, మూగజీవాల కాపలాకు వెళ్లే వారు సైతం ఏటా వర్షాకాలంలో అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఒక్కోసారి గెడ్డలకు గండ్లు పడితే పంట పొలాలు ముంపునకు గురవు తున్నాయి. మరికొన్ని చోట్ల లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి.



ఓనిగెడ్డ ఇలా..

ఇదీ పరిస్థితి..

జిల్లాలో సాకిగెడ్డ, వరహాలు , ఖానాల, నాగుల, గుమిడి, రాళ్ల, గజాలఖానా, ఓని, ఒట్టి, మల్లి, కుశిమి , గొయిది, చంద్రమ్మ, కొరమ, బొంది, దుగ్గేరు వద్ద సాకి, రావాడ, జంపరకోట తదితర గెడ్డలు ఏజెన్సీ ప్రాంతాల నుంచి మైదాన ప్రాంతాలకు ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాల సమయంలో మైదాన ప్రాంతాల గుండా నాగావళి, వంశధార, వేగావతి తదితర నదుల్లో వరద చేరుతుంది. కాగా గడిచిన వారం రోజుల్లో గెడ్డల్లో కొట్టుకుపోయి ఇద్దరు మృతి చెందారు. పాలకొండలోని కొండవీధికి చెందిన మత్స్యకారుడు చేపల వేటకని గోపాలపురం ఓనిగెడ్డలో పడి మృతి చెందాడు. సాలూరు మండలంలో ఓ రైతు పొలానికి వెళ్లే క్రమంలో ఒట్టిగెడ్డలో గల్లంతయ్యాడు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో మూగజీవాలు కూడా గెడ్డల్లో కొట్టుకుపోయినట్టు ఆయా పాడి రైతులు, పశు పెంపకందారులు వాపోతున్నారు. ఈ క్రమంలో ఇటీవల కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ గెడ్డ ప్రాంతాలను పరిశీలించి.. ప్రజలను అప్రమత్తం చేశారు. గెడ్డ, వాగుల్లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటే ఎవరూ అటువైపు వెళ్లకుండా చూడాలని అధికారులకు సూచించారు. చిన్నారులు ఈతకు వెళ్లకుండా చూడాలని ఆదేశించారు. అయితే గెడ్డల ప్రాంతాల్లో ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని మన్యంవాసులు కోరుతున్నారు.

రేపు కందివలసకు

మంత్రి నారా లోకేశ్

పూసపాటిరేగ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కందివలసలోని ఎస్ఎమ్ఎస్ ఫార్మా పరిశ్రమను గురువారం రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి, సమాచార సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేశ్ సందర్శించనున్నారు. పరిశ్రమలో నూతన ఉత్పత్తి బ్లాక్‌లను ఆయన ప్రారంభిస్తారు. హెలీ ప్యాడ్‌ను పరిశ్రమ వద్ద సిద్ధం చేస్తున్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట మధ్యలో ఇక్కడకు వస్తారని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఆయన వెంట మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వంగలపూడి అనిత తదితర నాయకులు ఉండనున్నారు.



ప్రత్యేక అలంకరణలో

పైడిమాంబ

సరికొత్తగా స్వాగతానికి...

6లో

యూరియాను

అధికంగా వాడొద్దు

- రైతులకు సూచించిన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

కురుపాం రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): యూరియాను రైతులు అధిక మొత్తంలో వినియోగించరాదని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సూచించారు. నానో యూరియాపై అవగాహన పెంచుకోవాలన్నారు. మంగళవారం ఉదయపురం గ్రామ రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా యూరియా కొరత, వివిధ రకాల పంటల సాగు వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి యూరియా పంపిణీ చేశారు. ఆ గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. బాలికలతో మాట్లాడి.. సదుపాయాలపై ఆరా ఈశారు. తరగతి గదిలో కాసేపు ఉపాధ్యాయునిగా మారారు. మొండెంఖల్‌లో రైతులతో కూడా కలెక్టర్ ముచ్చటించారు. ఊర చెరువు అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పూడికలు తీయిస్తామని, రైతులు కూడా చెరువు పనుల్లో భాగస్వాములవ్వాలని కోరారు. ఆ తర్వాత మొండెంఖల్ పీహెచ్‌సీని సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలు, మందులు తదితర విషయాలను వైద్యాధికారి బుద్ధేసును అడిగి తెలుసుకున్నారు. గుమ్మ గ్రామంలో వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఆయన వెంట జిల్లా ప్రోగ్రాం అధికారి వినోద్ కుమార్, ప్రత్యేక ఉప కలెక్టర్ ధర్మచంద్రారెడ్డి, ఇంజనీరింగు అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

బోర్లు తవ్వారు.. 8లో

హెడ్ బిగించడం

మరిచారు

- ఆరు నెలలుగా నిలిచిన పనులు



పసిడి పరుగులు

- తులం రూ.1.31 లక్షలు
- బెంబేలెత్తిపోతున్న కొనుగోలుదారులు



సాలూరు రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పసిడి ధర పరుగులు పెడుతోంది. రోజు రోజుకూ ధర పెరిగిపోవడంతో కొనుగోలుదారులు బెంబేలెత్తిపోతున్నారు. కాగా మంగళవారం 24 క్యారెట్ల పది గ్రాముల ధర రూ.1,12,810కు చేరింది. తులం రూ.1,31,581గా ఉంది. గత 12 రోజులుగా సగటున రూ.1000 చొప్పున బంగారం ధర పెరిగింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు చూస్తే 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ. 30,810 వరకూ పెరిగింది. గత 12 రోజుల్లో రూ. 11 వేలుకు పైగా పెరిగిందని మార్కెట్ వర్గాలు తెలియజేస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ధోరణితో అంతర్జాతీయంగా బంగారం ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు చెబుతున్నారు. అయితే వివాహాలు, శుభకార్యాలు ఉన్నవారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొందరు తప్పనిసరై పుత్తడిని కొనుగోలు చేస్తున్నారు. 'బంగారం ధర ఎప్పుడు ఎలా ఉంటుందో చెప్పలేం. అత్యవసరం, అవసరం బట్టి ప్రస్తుత ధరల్లో కొనుగోలు చేసుకోవడం ఉత్తమం. వెండి ధర సైతం పెరిగింది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 1,31,900గా ఉంది. ఎవరైనా బీఎస్ఐ హోల్‌మార్క్ ఉన్న వాటినే కొనుగోలు చేయడం మేలు.' అని సాలూరు గోల్డ్ అండ్ సిల్వర్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరవెంకటరావు తెలిపారు.

విద్యార్థులు 8లో

ఉన్నత స్థితికి చేరాలి

- డీవీఈవో నాగేశ్వరరావు

ఆసుపత్రుల్లో 8లో

సౌకర్యాలు కల్పిస్తాం

- ప్రభుత్వ విప్ జగదీశ్వరి



అక్రమాలకు అడ్డాగా..



- జిల్లాలో పలు పీఏసీఎస్‌లు
- రికవరీ అంతంత మాత్రమే.. బాధ్యులపై చర్యలు శూన్యం
- తాజాగా గరుగుబిల్లి పీఏసీఎస్‌లో అవకతవకలు వెలుగులోకి..
- రూ.90 లక్షలకు పైగా పక్కదారి
- విచారణ చేపడుతున్న అధికారులు

పార్వతీపురం/గరుగుబిల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు పీఏసీఎస్‌లు అక్రమాలకు అడ్డాగా మారాయి. రైతుల నుంచి రుణాలు రికవరీ చేసినా రికార్డుల్లో చూపించకపోవడంతో అవకతవకలు బయటపడుతున్నాయి. 2014-15లో రావివలస పీఏసీఎస్‌కు సంబంధించి సుమారు రూ. 4 కోట్లు పక్కదారి పట్టాయి. అప్పట్లో సీబీఐ విచారణ జరపగా కొంత వరకూ రికవరీ చేశారు. అయితే ఏళ్లు గడుస్తున్నా అక్రమాలకు పాల్పడిన పీఏసీఎస్ సిబ్బంది, దానికి కారకులైన వారిపై చర్యలు లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో చెముడు పీఏసీఎస్‌లో లక్షలాది రూపాయలు దుర్వినియోగమైనా బాధ్యులపై ఎటువంటి చర్యల్లేవు. దీనిపై కొంతమంది సిబ్బంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పార్వతీపురం మండలం కృష్ణపల్లి పీఏసీఎస్ పరిధిలో రుణమాఫీ జరిగినా.. నేటికీ ఆ రుణాలు రైతులను పట్టిపీడిస్తున్నాయి. తాజాగా గరుగుబిల్లి పీఏసీఎస్ అంశం చర్చనీయాంశమవుతోంది.



గరుగుబిల్లి పీఏసీఎస్ కార్యాలయం



విచారణ చేస్తున్న అధికారులు

ఇదీ పరిస్థితి..

కొద్దిరోజుల కిందట విజయనగరం డీసీసీబీ సీఈవో సంతోష్ కుమార్ గరుగుబిల్లి పీఏసీఎస్ అక్రమాలను గుర్తించారు. సభ్యుల పొందిన రుణాల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చడంతో వాస్తవాలు తెలుసుకున్నారు. సుమారు (మిగతా 8వ పేజీలో...)

బీమా.. ధీమా

- ఉపాధి ఉద్యోగులకు ప్రభుత్వం తీపికబురు
- ప్రమాద బీమా కల్పిస్తూ నిర్ణయం
- ఎస్బీఐతో అవగాహన ఒప్పందం

6లో

పైడిమాంబ జాతర 6లో

పనులకు టెండర్లు



ఒక్క క్షణం ఆలోచించండి



● సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు ● నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం

సాలూరు రూరల్/విజయనగరం రింగురోడ్డు/విజయనగరం క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిన్న చిన్న కారణాలకే ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారి సంఖ్య ఇటీవల కాలంలో పెరుగుతోంది. ముఖ్యంగా యువత అధికంగా బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. చిన్న సమస్యలు ఎదురైనా తట్టుకోలేక... మరణాన్ని ఆశ్రయిస్తున్నారు. ఇది ఎంతమాత్రం మంచిది కాదు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని చెబుతున్నారు మానసిక వైద్య నిపుణులు. ఒక్క క్షణం ఆలోచిస్తే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని.. ఆ దిశగా ముందుకు వెళ్లాలని సూచిస్తున్నారు.

యువతే అధికం..

18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉన్న వారు అత్యధికంగా ఆత్యహత్యలకు పాల్పడుతున్నట్టు వివిధ సర్వేలు చెబుతున్నాయి. 60 నుంచి 75 ఏళ్ల మధ్య వృద్ధులు 15 శాతం, మిగిలిన వయస్సుల వారు ఐదు శాతం ఆత్యహత్యలకు పాల్పడుతున్నట్టు సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. ఆత్యహత్యలు చేసుకుంటున్న వారిలో 85 శాతం అక్షరాస్యులు, 15 శాతం నిరక్షరాస్యులు ఉంటున్నారు.

కుమారుడు దూరమై...

రాజాం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆ యువకుడికి రూ.లక్షకుపైగా జీతం. ఆపై వర్క్ ఫ్రం హోం. తల్లిదండ్రులు, ఇద్దరు చెల్లెళ్లతో హాయిగా జీవితం గడిచిపోతున్న సమయం. కుటుంబమంతా ఆనందంగా ఉన్న తరుణం. చెల్లెళ్లు ఇద్దరికీ పెళ్లి చేసి..తాను ఒక ఇంటివాడిని కావాలని కలలుగన్నాడు. తల్లిదండ్రులు కూడా ముగ్గురు పిల్లలను చూసి మురిసిపోయారు. వారి ఆనందం చూసి విధికి కన్నుకుట్టిందేమో.. ఆత్మహత్య రూపంలో ఆ యువకుడ్ని బలి తీసుకుంది. ఆ కుటుంబానికి అంతులేని విషాదం మిగిల్చింది. ఇదీ రాజాం వస్త్రపురికాలనీకి చెందిన వెంకటేష్ విషాదాంతం. ఆర్నిపల్లి సింహాచలంకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుమారుడు వెంకటేష్ బీటెక్ పూర్తిచేశాడు. ఇద్దరు కుమార్తెలు డిగ్రీ చేస్తున్నారు. సింహాచలం ఓ ప్రైవేటు ఫ్యాక్టరీలో దినసరి కూలీ. వెంకటేష్‌కు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం వచ్చింది. దీంతో ఆ కుటుంబం ఆర్థిక కష్టాలు తీరాయి. సొంత ఇంటిని కూడా నిర్మించుకున్నారు. కొద్ది నెలల కిందట కుమారుడు వెంకటేష్ ఉన్నట్టుండి ఆత్మహత్య చేసుకున్నాడు. తన సమస్యేమిటో కుటుంబ సభ్యులకూ చెప్పలేదు. ఒక్కగానొక్క కుమారుడు అర్థాంతరంగా తనువు చాలించడంతో ఆ కుటుంబాన్ని మళ్లీ కష్టాలు చుట్టుముట్టాయి. కుమారుడు దూరమై నెలలు గడుస్తున్నా ఇంకా ఆ దంపతులు తేరుకోలేదు. కుమారుడిని తలచుకొని నిత్యం కన్నీటిపర్యంతమవుతున్నారు.

ఒత్తిడితోనే..

అధిక శాతం ఆత్మహత్యలకు కారణం మానసిక ఒత్తిడేనని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు, ప్రేమ వైఫల్యం, కుటుంబ తగదాలు వంటి అంశాలు ఒత్తిడికి కారణమవుతున్నట్టు చెబుతున్నారు. అప్పుల బాధలు, వివాహేతర సంబంధాలు, కుటుంబ సమస్యలు ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్నట్టు మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. మార్కుల ఒత్తిడి, వ్యసనాలు వంటివి కూడా ఆత్మహత్యలకు కారణమవుతున్నాయి. దీన్ని మొదటి దశలో గుర్తించడం కీలకమని అంటున్నారు. కౌన్సెలింగ్, యాంటీ డిప్రెషన్ థెరపీ, సైకోథెరపీతో సాధారణ స్థితికి తీసుకురావచ్చునని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు.

విజయనగరం జిల్లాలో ఆత్మహత్యలు ఇలా..

సంవత్సరం	పురుషులు	స్త్రీలు	మొత్తం
2024	182	44	226
2025 జూలై వరకూ	111	26	137



మానసిక సమస్యలతోనే..

మెదడులో రసాయనాలు, హార్మోన్ల అసమతుల్యం, మానసిక రుగ్మతల వల్ల ఆత్మహత్యలు చేసుకునే అవకాశం ఎక్కువ. ఆత్మహత్య తలంపు రావడానికి కారణం సెరటోనిన్, డోపమిన్ వంటి రసాయనాల లోపం. అలాగే కార్టిసోల్, థైరాయిడ్ హార్మోన్‌ల అసమతుల్యం వల్ల రావచ్చును. డిప్రెషన్, ఆందోళన, బైపోలార్ డిజార్డర్ వంటి మానసిక రుగ్మతలతో ముడిపడి ఉంటాయి. ఆత్మహత్యలు చేసుకునే వ్యక్తులు ఉదాసీనంగా ఉండడం... ఏ విషయంపై ఆసక్తి లేకపోవడంతో జీవితంలో పనికిరామని అనుకుంటారు. హఠాత్తుగా అందరితో మాట్లాడకుండా మౌనంగా ఉండడం.. ఒంటరి తనాన్ని కోరుకోవడం, మరణం గురించి పదే పదే ప్రస్తావించడం, చిన్న చిన్న విషయాలకు ఆగ్రహం లేదా కన్నీళ్లు తెచ్చుకోవడం వంటి లక్షణాలు ఉన్నప్పుడు ఆ వ్యక్తి కుటుంబ సభ్యులు లేదా స్నేహితులు అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలి. ఆత్మహత్య తలంపు అనేది ఒక తీవ్రమైన ఆరోగ్య సమస్య. ఇది బలహీనత కాదు. చికిత్స చేయగల స్థితి.

-డాక్టర్ హేమంత్ మాధవ్, మానసిక వైద్య నిపుణులు



సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి..

సమస్యలు ఎదురైతే వాటిని ధైర్యంగా ఎదుర్కొని ముందుకు వెళ్లాలి తప్ప ఆత్మహత్యలకు పాల్పడకూడదు. క్షణికావేశంలో చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. చిన్న, చిన్న సమస్యలు ఉంటే.. కుటుంబ సభ్యులు, స్నేహితులతో వాటిని పంచుకోవాలి. ఏ సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. వాటిని ఎదుర్కోవాలి తప్ప ఆత్మహత్యలకు పాల్పడకూడదు.

-ఎస్పీ వకుల్ జిందాల్





శ్రీముత్యాలమ్మ, శ్రీ తోగాలమ్మ

అమ్మవార్లకు పూలతో అలంకరణ

భోగాపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుడివాడ పంచాయతీలో గల శ్రీ ముత్యాలమ్మ, శ్రీ తోగాలమ్మ అమ్మవార్లను మంగళవారం భక్తులు ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవార్లకు పుష్పాలు, పత్రాలతో పూలదండలు తయారు చేసి అలంకరించారు. మంగళవారం కావడంతో వివిధ ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు. ముడుపులు చెల్లించుకున్నారు.

రాజాం మునిసిపాలిటీకి కొత్త వాహనాలు

● జీఎంఆర్ వితరణ



వాహనాలను పరిశీలిస్తున్న అధికారులు

రాజాం రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజాం పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, జి.ఎం.ఆర్. గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ గ్రంధి మల్లికార్జున రావు (జి.ఎం.ఆర్.) స్థానిక మునిసిపాలిటీకి తనవంతు చేయూతనం దిస్తున్నారు. ఈ మేరకు రూ.కోటి విలువచేసే రెండు ట్రాక్టర్లు, ఒక ట్రేసర్‌ను సిద్ధం చేశారు. వీటిని జి.ఎం.ఆర్. వ్యక్తిగత సహాయకుడు అన్నంనాయుడు ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు తదితరులు మంగళవారం పరిశీలించారు. వీటిని త్వరలో రాజాం మున్సిపాలిటీకి అందించేందుకు జి.ఎం.ఆర్. వరలక్ష్మి ఫౌండేషన్ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాజాం మున్సిపాలిటీలో రోజుకు సుమారు 13 టన్నుల పొడి, తడిచెత్త వస్తోంది. ఇప్పటికే విశాఖలోని జిందాల్ పవర్ కర్మాగారంతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం మేరకు నిత్యం 11 టన్నుల పొడిచెత్తను విశాఖకు పంపించాల్సి ఉంది. చెత్తను విశాఖ తరలించేందుకు అవసరమైన వాహనాలు మునిసిపాలిటీలో లేవు. ఉన్న ట్రాక్టర్లు కూడా దాదాపుగా మరమ్మతులకు గురయ్యాయి. దీంతో వారానికి ఒకటి రెండుసార్లు మాత్రమే రాజాం మున్సిపాలిటీ నుంచి పొడిచెత్తను విశాఖలోని జిందాల్‌కు తరలిస్తున్నారు. రవాణా ఖర్చులు అధికం కావడంతో చేసేదిలేక ఈ ఏడాది జనవరిలో రాజాం వచ్చిన జి.ఎం.ఆర్.ను మున్సిపల్ కమిషనర్ కలిసి పరిస్థితిని వివరించారు. పట్టణంలో పేరుకుపోతున్న వ్యర్థాలను తరలించేందుకు రెండు ట్రాక్టర్లు, ట్రేసర్ (పెద్ద వాహనం) అవసరమని కమిషనర్ నాయుడు జి.ఎం.ఆర్.కు వివరించారు. ఆమేరకు తాజాగా మూడు వాహనాలను రాజాం తెప్పించారు. వీటిని త్వరలో మున్సిపాలిటీకి అందించనున్నారు.



ప్రత్యేక అలంకరణలో పైడిమాంబ

విజయనగరం కల్చరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ ఆలయంలో మంగళవారం సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి క్యూ కట్టారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని వనంగుడిలో పైడిమాంబకు విశేష పూజలు చేశారు. ఇదిలావుండగా మంగళవారం పైడిమాంబకు ప్రీతిపాత్రమైన రోజు కావడంతో వివిధ రకాల పువ్వులతో అలంకరించారు.



5కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఎయిడ్స్ నివారణపై అవగాహన అవసరం

● మన్యం కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ నివారణపై అవగాహన పెంచుకోవాలని మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. మంగళవారం శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల వద్ద నుంచి ప్రారంభించిన 5కే రన్‌ను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. నాలుగు రోడ్ల కూడలి మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ ప్రధానంగా రక్షణ లేని లైంగిక సంబంధాలు, రక్తమార్పిడి, వాడిన సిరంజీల వినియోగం ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ప్రజలకు సూచించారు. 5కే రన్‌లో గెలుపొందిన విజేతలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

పైడిమాంబ జాతర పనులకు టెండర్లు



కాంట్రాక్టర్లతో సమావేశమైన దేవదాయ శాఖ అధికారులు

విజయనగరం కల్చరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ జాతర నిర్వహణకు దేవదాయ శాఖ సన్నద్ధమవుతోంది. జాతర సందర్భంగా మూడు రోజుల పాటు వివిధ రకాల పనులు చేపట్టేందుకు టెండర్లు ఖరారు చేసింది. విద్యుత్ దీపాలు, క్యూలైన్లు, ప్రసాదాల తయారీ, బారికేడ్ల ఏర్పాటు తదితర పనులను కాంట్రాక్టర్లకు అప్పగించాలని దేవదాయ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం దేవదాయ శాఖ సహాయ కమిషనర్, పైడిమాంబ దేవస్థానం ఇన్‌ఛార్జి ఈఓ కె.శిరీష వివిధ పనులకు షీల్డ్ టెండర్లు తెరిచారు. సంబంధిత కాంట్రాక్టర్లతో సమావేశమయ్యారు. ఏయే ప్రాంతాల్లో విద్యుత్ దీపాలను అలంకరించాలి? ఎంత మేర క్యూలైన్లు ఏర్పాటు చేయాలి? ప్రసాదాల తయారీ సంఖ్య, బారికేడ్లు తదితర అంశాలపై ఆమె చర్చించారు. దేవదాయశాఖ కొన్ని పనులకు పాత రేట్లను ఖరారు చేయడం వల్ల తమకు గిట్టుబాటు కాదని కొంత మంది కాంట్రాక్టర్లు చెబుతున్నారు. పాత రేట్ల ప్రకారం ప్రస్తుతం పని చేయాలంటే ఇబ్బందులు ఎదురవుతాయని అంటున్నారు. ధరలను పెంచి టెండర్లు ఖరారు చేయాలని వారు కోరుతున్నారు. ఈ నెల 17 నాటికి టెండరు ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. అనంతరం కాంట్రాక్టర్లు పనులు చేపడతారు.



నగరపాలక సంస్థ కార్యాలయం వద్దనున్న స్వాగత ద్వారం

సరికొత్తగా స్వాగతానికి...

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయానికి వచ్చే వారికి స్వాగతం పలికేందుకు సరికొత్త స్వాగత ద్వారాన్ని ఏర్పాటు చేశారు. వివిధ రకాల మొక్కలతో దీన్ని అందంగా తీర్చిదిద్దారు. దీంతో ఆ ప్రాంతమంతా పచ్చదనంతో శోభయామానంగా దర్శనమిస్తోంది. మొక్కల పెంపకం ఆవశ్యకతను తెలియజేప్పాలన్న ఉద్దేశంతో దీనిని రూపొందించినట్టు కమిషనర్ నల్లనయ్య తెలిపారు.

సర్వీసు రోడ్డు సమస్య మళ్లీ మొదటికి..



సర్వీసు రోడ్డు విషయమై అధికారులను ప్రశ్నిస్తున్న స్థానికులు

చీపురుపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి పట్టణంలోని సర్వీసు రోడ్డు సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ఇక్కడ ఆర్వోబీకి ఆనుకొని... నిర్మించాల్సిన సర్వీసు రోడ్డు విషయంలో స్థానికులు కొత్త డిమాండ్ లేవనెత్తారు. దీంతో మంగళవారం ఇక్కడ సమావేశమైన ఆర్‌అండ్‌బీ, రైల్వే అధికారులు వెనుదిరిగారు. నిర్మాణంలో ఉన్న ఆర్వోబీని ఆనుకొని కొత్తఅగ్రహారం వెళ్లేందుకు ఇక్కడ సర్వీసు రోడ్డు నిర్మించాల్సి ఉంది. దీనిని నిర్మించాలంటే మెయిన్ రోడ్డులో ఉన్న నివాసాలను సుమారు 12 అడుగుల మేర తొలగించాలి. గతంలో ఎమ్మెల్యే కళా వెంకటరావు స్థానికులతో మాట్లాడి 12 అడుగుల వరకు ఖాళీ చేయడానికి స్థానికులను ఒప్పించారు. ఈ క్రమంలో ఆక్రమణల తొలగింపుపై చర్చించేందుకు రైల్వే అధికారులు, ఆర్‌అండ్‌బీ డీఈ రవిశేఖర్, ఏఈఈ కె.మురళీబాబు మంగళవారం బ్రిడ్జి వద్ద సమావేశమయ్యారు. కొత్తఅగ్రహారానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఇజరోతు రాంబాబు అధికారులను కలిసి.. తమ నివాసాలకు వెళ్లేందుకు కేవలం 13 అడుగుల రోడ్డు సరిపడదని... కనీసం 20 అడుగులు ఉండాలని కొత్త ప్రతిపాదన తెరపైకి తెచ్చారు. దీంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చినట్లయింది. కొత్త ప్రతిపాదనల నేపథ్యంలో ఎటూ తేల్చుకోలేక రెండు శాఖలకు చెందిన అధికారులు వెనుదిరిగారు.

బీమా.. ధీమా



● ఉపాధి ఉద్యోగులకు ప్రభుత్వం తీపికబురు
● ప్రమాద బీమా కల్పిస్తూ నిర్ణయం
● ఎస్బీఐతో అవగాహన ఒప్పందం
● జిల్లాలో 495 మందికి ప్రయోజనం

మెంటాడ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి)

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు వినిపించింది. క్షేత్ర స్థాయి సిబ్బంది మొదలుకొని అధికారుల వరకూ ఎటువంటి ప్రీమియం చెల్లించే అవసరం లేకుండా వ్యక్తిగత ప్రమాద బీమాను వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలనూ విడుదల చేసింది. దీనివల్ల జిల్లాలో 495 మందికి ప్రయోజనం కలుగనుంది. ఉపాధి ఉద్యోగులకు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) కార్పొరేట్ జీతం ప్యాకేజీ కింద రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు సీఈవో-ఎస్ఆర్‌డీఎస్- ఎస్‌బీఐ మధ్య ముసాయిదా అవగాహన ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం రూ.10 వేల నుంచి రూ.25వేల మధ్య వేతనం పొందుతున్న వారికి రూ.3 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుంది. రూ.25 వేల నుంచి రూ.50 వేల మధ్య వేతనదారులకు 12 లక్షలు, రూ.50 వేల నుంచి రూ.లక్ష వేతనం పొందే వారికి రూ.30 లక్షల ప్రమాద బీమా వర్తించనుంది. జిల్లా వ్యాప్తంగా క్షేత్ర స్థాయి సిబ్బంది నుంచి అధికారుల వరకూ మొత్తం 495 మందికి లబ్ధి కలుగనుంది. లబ్ధి పొందేవారిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, స్థిర పదవీ కాల ఉద్యోగులు ఉన్నారు.

ఏం చేయాలంటే...

ఇప్పటి వరకు ఎస్బీఐ ఖాతా లేనివారు కార్పొరేట్ జీతం ప్యాకేజీ కింద కొత్తగా ఎస్బీఐ ఖాతాను తెరవాల్సి ఉంటుంది. ఇప్పటికే ఖాతా ఉన్నవారు వెంటనే సంబంధిత శాఖకు వెళ్లి దాన్ని ఎస్బీఐ కార్పొరేట్ జీతం ప్యాకేజీ ఖాతాలుగా మార్చుకోవాల్సి ఉంటుంది. పాన్‌కార్డు, ఆధార్ కార్డు, డిపార్టుమెంట్ ఐడీ కార్డు, తాజా జీతం ప్లే స్లిప్పు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు బ్యాంకు సిబ్బందికి అందజేయాలి.

ఏ కేటగిరీలో ఎంతమంది అంటే...

ఈ ప్రమాద బీమాకు ఎటువంటి ప్రీమియం చెల్లించనవసరం లేదు. ప్రభుత్వ నిర్ణయం నేపథ్యంలో జిల్లాలో లబ్ధి పొందనున్న 495 మందిలో మొదటి కేటగిరి కింద 279 మంది, రెండో కేటగిరిలో 177, మూడో కేటగిరిలో 39 మంది లబ్ధి పొందనున్నారు. ఎటువంటి ప్రీమియం చెల్లించకుండా బీమాను వర్తింపజేయడంపై ఆయా వర్గాల వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గ్రీవెన్స్‌కు 102 దరఖాస్తులు

లక్కవరపుకోట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం రెవెన్యూశాఖ నిర్వహించిన మెగా గ్రీవెన్స్‌కి రైతుల నుంచి 102 దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా పది గ్రామాలకు పది కౌంటర్లు ఏర్పాటు చేశారు. అత్యధికంగా కొట్యాడ, కల్లేపల్లి నుంచి ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ డిప్యూటీ తహసీల్దార్ కోటి, ఆర్ఐ సన్యాసిరావు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

నవదుర్గ హుండీ ఆదాయం రూ.2.79 లక్షలు

రాజాం రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నవదుర్గ అమ్మవారి ఆలయ హుండీలను దేవదాయశాఖ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణలో మంగళవారం తెరిచి లెక్కించారు. 91 రోజులకు రూ.2,79,395 ఆదాయం సమకూరింది. వంశపారంపర్య ధర్మకర్త వానపల్లి నరిసింగరావు, దేవదాయ శాఖ అధికారులు మాధవరావు, శ్యామలరావు, విశ్రాంత మేనేజర్ కూరాడ వెంకటరావు ఆధ్వర్యంలో హుండీలను లెక్కించారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

గజపతినగరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన 'ఎక్కడ చూసినా మురుగే' అనే కథనానికి అధికారులు స్పందించారు. లింగాలవలస, ఎం.గుమడాం, కొత్తశ్రీరంగరాజపురం, మల్లునాయుడుపేట తదితర గ్రామాల్లో డీఎల్‌పీవో కిరణ్‌కుమార్, ఈవోపీఆర్డీ సుగుణాకరరావు పర్యవేక్షణలో గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు నిర్వహించారు.

నేటి నుంచి స్విమ్స్ చర్చి 150వ వసంతాల వేడుకలు

విజయనగరం బాబామెట్ట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): విజయనగరంలో స్విమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి 150 వసంతాల వేడుకలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నాయని స్విమ్స్ చర్చి ప్రతినిధి డా.ఆర్‌ఎస్ జాన్ తెలిపారు. మంగళవారం స్థానిక చర్చి ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఉత్సవాలకు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని చెప్పారు. ఈ వేడుకలు 14వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. క్రైస్తవ పెద్దలు పాల్గొన్నారు.

లీగల్ మెట్రాలజీ అధికారుల దాడులు

● 30 మందిపై కేసుల నమోదు

రాజాం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో లీగల్ మెట్రాలజీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. శ్రీకాకుళం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ బలరాం కృష్ణ, బొబ్బిలి లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ సుందరి సంయుక్తంగా పండ్ల దుకాణాలు, వ్యాపార సంస్థలపై దాడులు నిర్వహించారు. తూకంలో తేడాలు గుర్తించారు. ఈ మేరకు 30 మందిపై కేసులు నమోదు చేశారు. తూకంలో అక్రమాలకు పాల్పడినా, ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయించిన వారిపై చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ బలరాంకృష్ణ హెచ్చరించారు.

14న ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీలు

కొత్తవలస, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): తుమ్మికాపల్లి గేట్ సమీపంలో మెగా యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 14 తేదీన ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్‌పోటీలను నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలు ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తామన్నారు. విజేత గ్రూపులకు రూ.8వేలు, రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు చొప్పున నగదు బహుమతులు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారికి భోజన సదుపాయం కల్పిస్తామని చెప్పారు. ఔత్సాహికులు 8978792317, 701368127, 7995114120 నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

నీటి పన్ను వసూళ్లు ముమ్మరం చేయాలి

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని నీటి పన్ను వసూళ్లను ముమ్మరం చేయాలని ఎమినిటీస్, అడ్మిన్ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా సచివాలయం వారీగా చేపట్టిన నీటి చార్జీల వసూళ్లపై సమీక్షించారు. లక్ష్యాల కంటే దిగువ స్థాయిలో వసూలు చేసిన కార్యదర్శులను మందలించారు. నీటి చార్జీలు వసూలు శతశాతం జరిగే విధంగా కృషి చేయాలన్నారు. సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, డీఈ నర్సింహారెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా ముందుకు వచ్చి..

● రోడ్డుకు మరమ్మతులు

పూసపాటిరేగ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పూసపాటిరేగలోని రాజవీధిలో రహదారి పాడవటంతో వర్షపునీరు నిలిపోతుంది. స్థానికులు పలుమార్లు నాయకులకు, అధికారులకు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో స్థానిక దుకాణదారులు స్పందించి, వారి దుకాణాల ముందు ఉన్న రహదారికి మరమ్మతులు చేసుకున్నారు. పీహెచ్‌సీ వద్ద రహదారి పూర్తిగా పాడవ్వడంతో వీరు సొంత నిధులు వెచ్చించి, మరమ్మతులు చేసుకున్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణ

● ఇష్టారాజ్యంగా వ్యాపారాలు

గంట్యాడ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కొటారుబిల్లి కూడలిలోని ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఎన్నో ఏళ్ల నుంచి ఆక్రమించి చిరువ్యాపారులు సాగిస్తున్నారు. అయితే విజయనగరం నుంచి బొడ్డవర వెళ్లే రహదారి విస్తరణలో భాగంగా ఈ కూడలిలో ఉన్నవారికి ప్రభుత్వం అప్పట్లో పరిహారం చెల్లించి, పనులు ప్రారంభించింది. కానీ పరిహారం పొందినవారు ఎప్పటిలాగే వ్యాపారులు కొనసాగిస్తున్నారు. ఈ కూడలిలో ఇటీవల ఇద్దరు వ్యాపారస్థుల మధ్య చిన్న స్థలం సమస్యపై వివాదం చోటుచేసుకుంది. దీంతో ఒకరిపై ఒకరు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఇప్పటికీ ఈ


కొటారుబిల్లి కూడలిలో ఆక్రమణకు గురైన స్థలం

స్థలంపై స్పష్టత రాలేదు. పోలీసులు సమక్షంలో పంచాయితీ నలుగుతుంది.

● పెదమజ్జిపాలెం కూడలిలో మరువాడ, కొత్తపాలెం గ్రామాలకు వెళ్లే రహదారి పక్కన ఆనుకుని ఉన్న తన సొంత స్థలంలో ఒకరు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించుకున్నారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్ ముందు ఓ వ్యక్తి ప్రభుత్వం స్థలాన్ని ఆక్రమించి షెడ్డు వేసుకోవడంతో ఆ షాపింగ్ కాంప్లెక్స్ యాజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆ స్థలాన్ని పరిశీలించారు. కానీ ఈ సమస్య ఎటూ తేలలేదు.

● తాటిపూడి వద్ద ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి పలువురు వివిధ వ్యాపారులు సాగిస్తున్నారు. పీడబ్ల్యూడీ భూములను ఆక్రమించి ఇష్టానుసారంగా వ్యాపారం సాగిస్తున్నా పట్టించుకున్న నాథుడే లేడు.

పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు

మండలంలోని పెదమజ్జిపాలెం కూడలిలో రహదారి అక్రమణ తొలిగించాలంటూ గ్రామానికి చెందిన కె.అప్పలరాజు, ఎస్.నారాయణరాజులు సోమవారం పీజీఆర్ఎస్‌లో జేసీకి విన్నవించారు. గ్రామానికి చెందిన కొంతమంది రోడ్డును ఆక్రమించి షెడ్లు ఏర్పాటు చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.


పెదమజ్జిపాలెం కూడలిలో ఆక్రమణకు గురైన స్థలం

దీనివల్ల కొండతామరాపల్లి గ్రామం నుంచి మరువాడ, కొత్తవలస గ్రామాలకు వెళ్లే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని వివరించారు. దీనిపై గంట్యాడ పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామని, అయినా పరిష్కారం లేదని చెప్పారు. వెంటనే విచారణ చేసి ఆక్రమణలు తొలగించాలని వారు కోరారు.

రహదారిని పరిశీలించాం

పెదమజ్జిపాలెం కూడలిలో ఆర్అండ్‌బీ రహదారిని ఆక్రమించుకున్నారంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు తమ సిబ్బందితో ఇటీవల పరిశీలించాం. రెవెన్యూ అధికారులను ఎఫ్ఎంబీ రికార్డు కూడా అడిగాం. ఎఫ్ఎంబీ తీసుకున్న తర్వాత రోడ్డును పరిశీలించి.. ఆక్రమణ ఉంటే తొలగిస్తాం.

- కాంతిమతి, ఎస్ఈ, ఆర్అండ్‌బీ

సీఎంఆర్ఎఫ్ పంపిణీ


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.46 లక్షల విలువగల చెక్కులను ఎమ్మెల్యే లోకం నాగమాధవి మంగళవారం ముంజేరులోని జనసేన పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. డెంకాడ మండలం జొన్నాడకు చెందిన అట్టాడ ఈశ్వరమ్మకు, పూసపాటిరేగ మండలం కొల్లాయివలసకు చెందిన చెట్ల బంగారమ్మలకు ఈ చెక్కులను అందజేవారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

విజయనగరం రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చెప్పారు. విజయనగరంలోని బీసీ కాలనీలో ఉన్న మహిళా ప్రాంగణంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఉద్యోగ మేళాను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించి, యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం


సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మార్లాపల్లి గ్రామంలో ఈనెల 6న జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన ఐదు కుటుంబాలకు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే లలితకుమారి సాయం అందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆర్థిక సహాయంతో పాటు ఎమ్మెల్యే సాయం కూడా జతవ్వడంతో బాధితులకు స్వాంతన కలిగింది. ఒక్కో కుటుంబానికి బస్తా బియ్యం, వంట సామగ్రి, దుప్పట్లు అందజేశారు. ప్రభుత్వం తరపున సాయం అందేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రెడ్‌క్రాస్ సొసైటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.వరలక్ష్మీతో పాటు టీడీపీ నాయకులు యడ్ల పైడిరాజు, గోగాడ రామారావు, డి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

మేలైన బోధనను అందించాలి

గజపతినగరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు మేలైన బోధనను అందించాలని జిల్లా వృత్తి విద్యా శాఖ అధికారి ఆర్.తవిటినాయుడు అన్నారు. మంగళ వారం స్థానిక జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పట్నాయక్ పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

బొండపల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఎంపీపీ చల్లా చలంనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తొలుత ఏవో మల్లికార్జునరావు మాట్లాడుతూ నానో ఎరువులకు రైతులు మక్కువ చూపాలని, యూరియా అందుబాటులో ఉంచేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. అనంతరం వివిధ శాఖల వివరణ అనంతరం తహసీల్దార్ డొలా రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం 104 జీవోను అనుసరించి 150 అడుగుల చదరపు గజాల ఇంటి స్థలాలను రెగ్యులర్ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసిందని తెలిపారు. అలాగే 3వ విడత రీసర్వేలో భాగంగా వేంద్రాం, రయింద్రం గ్రామాలను ఎంపిక చేశామని వివరించారు. ఈసందర్భంగా ఎంపీపీ ప్రశ్నిస్తూ రైతులు చేస్తున్న మ్యూటేషన్లను కారణాలు లేకుండా తిరష్కరించడం సమంజసం కాదని తహసీల్దార్‌ను నిలదీశారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజును దుస్సాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గిరిబాల, గొట్లాం పీఏసీఎస్ అధ్యక్షుడు సిడగం శ్రీనివాస్, టి.రాజేరు, గిట్టుపల్లి, బొండపల్లి, ఒంపల్లి గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పాత బకాయిలపై దృష్టి సారించాలి

గజపతినగరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకు ద్వారా రైతులు తీసుకున్న రుణాలకు సంబంధించి బకాయిల వసూళ్లపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా సహకార బ్యాంకు జీఎం కేవీవీఆర్‌ఎస్ సత్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక బ్యాంకు శాఖ ఆవరణలో గజపతినగరం, బొండపల్లి, రాచకిండాం సహకార సంఘాల అధ్యక్షులు, సీఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాల్లో ఉన్న పాత బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సంఘాల్లో ఉన్న అప్పుల వసూళ్లపై బాధ్యత వహించాలన్నారు. రైతులకు వ్యవసాయ రుణాలు, స్వల్పకాలిక రుణాలు అందించి ఏడాదిలోగా చెల్లింపులు జరిపేలా చేయాలన్నారు. స్థానిక బ్రాంచ్ మేనేజర్ సురేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు లెంక బంగారునాయుడు, బుచ్చిరాజు, తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

రాజాం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ ఐటీఐ ఆధ్వర్యంలో గురువారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తామని ఐటీఐ ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు, ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి కల్పనలో భాగంగా ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, బీటెక్, ఏదైనా పీజీలో ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 35 ఏళ్ల వయస్సు మధ్య ఉన్నటువంటి నిరుద్యోగ యువతీ, యువకులు గురువారం ఉదయం 9 గంటలకు స్థానిక ప్రభుత్వ ఐటీఐలో జరుగునున్న మెగా జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు. ఈ జాబ్‌మేళాలో 12 బహుళ జాతి కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డుతో పాటుగా రెజ్యూమ్, ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ జిరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా జరిగే ప్రదేశంలో హాజరు కావలసిందిగా వారు కోరారు. పూర్తి వివరాలకు 7286042743, 9988853335 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

పేదల అభ్యున్నతే జనసేన లక్ష్యం

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతి, ప్రజా సంక్షేమమే జనసేన లక్ష్యమని రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి, జనసేన నాయకుడు గురాన అయ్యలు అన్నారు. ఆరో డివిజన్‌కు చెందిన 50 కుటుంబాలు మంగళవారం వారి సమక్షంలో వైసీపీ నుంచి జనసేన పార్టీలో చేరాయి. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సతీష్, రాము, చంద్రినాయుడు, శివ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరినవారితో యశస్వి, గురాన అయ్యలు

జోడుమెరక శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి

కొత్తవలస, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అప్పన్నదొరపాలెం పంచాయతీ జోడుమెరక గ్రామానికి సంబంధించి శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని సర్పంచ్ జోడు రాములమ్మ ఆధ్వర్యంలో ఆ గ్రామస్థులు మంగళవారం స్థానిక తహసీల్దార్ పి.అప్పలరాజుకు వినతిపత్రం అందజేశారు. అప్పన్నదొరపాలెం పంచాయతీకి చెందిన జోడుమెరక, తమ్మన్నమెరక గ్రామాల మధ్య గత కొన్నేళ్లగా శ్మశానవాటిక వివాదం నడుస్తోంది. ఈక్రమంలో జోడుమెరక గ్రామస్థులు తహసీల్దార్‌ను ఆశ్రయించారు. తమకు శ్మశానవాటికకు స్థలం కేటాయించే వరకు తమ్మన్నమెరక శ్మశానవాటికలో దహన సంస్కారాలు చేసుకోవడానికి ఒప్పించాలని కోరారు.

కనకమహాలక్ష్మి ఆలయానికి ట్రస్టీల నియామకం

చీపురుపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి 11 మంది ట్రస్టీలను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గవిడి నాగరాజు, పి.త్రినాథరావు, ఎ.లక్ష్మణరావు, ఎల్.రాధ, జి.సత్యం, ఎం.శ్రీనివాసరావు, ఎ.భారతి, ఐ.జయలక్ష్మి, ఎస్.ప్రియాంక, ఎం.రామకిరణ్, ఇప్పిలి పార్వతిలను ట్రస్టీలుగా నియమించింది. వీరిలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు. ఈ ఎన్నిక కోసం ట్రస్టీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం దేవదాయ తనిఖీ అధికారిని ఆదేశించింది. కాగా, ఈ బోర్డు రెండు సంవత్సరాల పాటు పదవిలో ఉంటుందని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఎరువుల సమస్యను పరిష్కరించాలి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువుల సమస్యను పరిష్కరించాలంటూ వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు స్థానిక కలెక్టరేట్ జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో దాట్ల కీర్తికి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, మాజీ ఎమ్మెల్యేలు కోలగట్ల వీరభద్రస్వామి, బడ్డుకొండ అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, మాజీ జడ్పీ చైర్మన్ శోభా స్వాతిరాణి, విజయనగరం, ఎస్.కోట, నెల్లిమర్ల నియోజకవర్గాలకు చెందిన వైసీపీ నాయకులు పాల్గొన్నారు. ● చీపురుపల్లి: ఎరువుల సరఫరాలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆరోపించారు. ఈ మేరకు పార్టీ నాయకులతో కలిసి ఆయన మంగళవారం చీపురుపపల్లి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. పాలకొండ మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, పార్టీ నాయకులు తలే రాజేష్, కేవీ సూర్యనారాయణరాజు, మీసాల వరహాలనాయుడు తదితరులు పాల్గొన్నారు. ● ఈ కార్యక్రమానికి అనుమతి లేకపోవడంతో డీఎస్పీ ఎస్.రాఘవులు నేతృత్వంలో పెద్దఎత్తున పోలీసులు పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈక్రమంలో పోలీసులకు, నాయకులకు మధ్య తోపులాట జరిగింది. ● భోగాపురం: ప్రతి రైతుకూ ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వైసీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి కోరారు. మంగళవారం విజయనగరంలో వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమానికి ఆయన తోపాటు మండలం నుంచి అధిక సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

నిలిచిన యూరియా పంపిణీ

● సరిపడినంత రాలేదని ఆందోళన

సంతకవిటి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కొండగూడెం గ్రామంలోని సచివాలయం వద్ద మంగళవారం చేపట్టాల్సిన యూరియా పంపిణీ కార్యక్రమం నిలిచిపోయింది.


ఏవోను చుట్టుముట్టి ఆందోళన చేస్తున్న రైతులు

అ సచివాలయానికి 210 బస్తాల యూరియా వచ్చింది. పంపిణీ సక్రమంగా నిర్వహించే నిమిత్తం ఏవో యశ్వంత్‌రావుతో పాటు పోలీసులు మంగళవారం ఉదయం అక్కడికి చేరుకున్నారు. అయితే ఈ సచివాలయ పరిధిలో సుమారు 400 మంది రైతులు ఉన్నారు. దీంతో ఒక్కొక్కరికి ఒక్క బస్తా కూడా అందదని గ్రహించిన రైతులు.. ఇంకో లోడు వచ్చినంతవరకు పంపిణీ వాయిదా వేయాలని ఏవోను కోరారు. దీనిపై ఏవో మాట్లాడుతూ.. కొండగూడెం సచివాలయానికి ఇదివరకే 10 టన్నుల యూరియా పంపిణీ చేశామని, ఇప్పుడు వచ్చిన 10 టన్నులు కూడా పంపిణీ చేసి, మళ్లీ ఇండెంట్ పెట్టి అందరి రైతులకు యూరియా అందేలా చేస్తామని తెలిపారు. కానీ రైతులు అంగీకరించకపోవడంతో పంపిణీ నిలిపివేశారు.

ఎరువుల కొరత లేదు

మెరకముడిదాం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎరువుల కొరత లేదనే విషయాన్ని రైతులకు చేరవేయాలని డీపీవో, మండల ప్రత్యేకాధికారి మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల వ్యవసాయ సహాయకులు, గ్రామ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎరువులు ఉపయోగించే విధానంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏవో శ్రావణతేజ, ఇన్‌చార్జి ఎంపీడీవో సుధాకర్ పట్నాయక్, విస్తరణాధికారి చందక శ్రీరాములు పాల్గొన్నారు. ● డెంకాడ: పంటకు కావాల్సిన యూరియాను రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేసిందని జిల్లా ఉద్యాన శాఖాధికారి, మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖరరావు తెలిపారు. సింగవరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన 'యూరియా మీ చెంతకు' కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. యూరియా ప్రతి రైతు సేవా కేంద్రానికి విడతలుగా వస్తుందని చెప్పారు. ఎంఆర్‌వో ఎం.రాజారావు, ఏవో టి.సంగీత, వ్యవసాయ విస్తరణాధికారి బి.రామకోటి, వీఏఏలు పాల్గొన్నారు. ● నెల్లిమర్ల: రైతులు యూరియాకు బదులు నానో యూరియా ఉపయోగించాలని ఏవో శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం కొండవెల గాడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి, రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవో రమేష్, వీఏఏలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి వృద్ధుడి మృతి

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇసుక ట్రాక్టర్ కింద పడి ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన ఎస్.కోటలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఈ విషయంపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానికంగా ఉన్న వన్‌వే ట్రాఫిక్ వద్ద కొటాన వల్లయ్య(75) అనే వృద్ధుడు నడుచుకుంటూ వెళ్తుండగా.. ధర్మవరం నుంచి ఎస్.కోట వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొంది. ఈక్రమంలో ఆయన వెనుక టైరు కింద పడిపోయారు. తీవ్ర గాయాల కారణంగా ఆయన ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ఘటనతో అక్కడ ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసును నమోదు చేసినట్టు సీఐ నారాయణమూర్తి తెలిపారు.

టైరుబండి కింద పడి ఒకరు..

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వేములాపల్లి గ్రామానికి చెందిన బి.సన్యాసిరావు(48) అనే వ్యక్తి ఇసుక టైరుబండి కింద పడి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సన్యాసిరావు వ్యవసాయ కూలీ. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం స్థానికంగా ఉన్న గోస్తనీ నదిలోకి ఇసుక సేకరణకు దిగారు. తన టైరుబండిలో ఇసుక నింపుకొని గట్టుపైకి వస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కింద పడిపోయారు. దీంతో లోడుతో ఉన్న బండి టైరు గుండె పైనుంచి వెళ్లింది. ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య ఉమ, పిల్లలు భువన్, మౌనిక ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ నారాయణమూర్తి తెలిపారు.

మహిళ ఆత్మహత్య

సంతకవిటి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): గోవిందపురం గ్రామానికి చెందిన పాలవలస లక్ష్మి(69) సోమవారం గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై ఏఎస్ఐ ఎం.వాసుదేవరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మీకి 15 ఏళ్ల కిందట విశాఖపట్నంలో మెదడుకు ఆపరేషన్ జరిగింది. గత మూడేళ్లగా తన పని కూడా తాను చేసుకోలేని విధంగా ఉండడంతో మనస్థాపం చెంది, సోమవారం గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. శ్రీకాకుళంలోని ఓ ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. కుమారుడు పాలవలస అన్నారావు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ వాసుదేవరావు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అందించామని చెప్పారు.

వృద్ధురాలి అదృశ్యం


చిట్టెమ్మ(ఫైల్)

రేగిడి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వావిలవలస గ్రామానికి చెందిన చీర చిట్టెమ్మ(66) అనే మహిళ అదృశ్యమైనట్టు తన కుమారుడు అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. చిట్టెమ్మ ఇటీవల మతిస్థిమితం కోల్పోయింది. దీంతో ఇటీవల తప్పిపోయి బలిజపేటలో తమ బంధువులకు దొరికింది. దీంతో వారు ఇంటికి చేర్చారు. తాజాగా మళ్లీ గత రెండు రోజులుగా కనిపించకపోవడంతో కుటుంబీకులు ఆందోళనకు గురవుతున్నారు. తన తల్లి ఆచూకీ దొరికినవారు రేగిడి పోలీసులకు గానీ, తనకు గానీ సమాచారం అందించాలని కుమారుడు అప్పలనాయుడు(సెల్ నెంబర్ 9908033517) కోరారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత

విజయనగరం క్రైం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో హోంగార్డుగా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఎంవీ కృష్ణారావుకు ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో రూ.3లక్షల 22వేల 340 చెక్కును అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పోలీసుశాఖలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు అనారోగ్యంతో మృతిచెందిన, ఉద్యోగ విరమణచేసిన హోంగార్డు కుటుంబాలను ఆదుకునేందుకు హోంగార్డులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఒకరోజు డ్యూటీ అలవెన్సు మొత్తాన్ని పోగుచేసి వారి కుటుంబాలకు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హోంగార్డుల ఇన్‌చార్జి ఆర్ఐ ఆర్.రమేష్ కుమార్, ఆఫీస్ సూపరింటెండెంట్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

టాస్ సర్వేపై తనిఖీలు

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఫైలేరియా వ్యాధిని అంచనా వేసేందుకు ప్రత్యేక వైద్య బృందాలు నిర్వహిస్తున్న టాస్ సర్వేపై ప్రత్యేక పరిశీలన అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మలేరియా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ కేవీఎస్ ప్రసాదరావు, జిల్లా మలేరియా అధికారిణి మణి, సీనియర్ ఎంటమాలజిస్ట్ జి.వరప్రసాద్‌రెడ్డి వేర్వేరుగా తనిఖీలు నిర్వహించారు. మాన్సాస్ స్కూల్, ఫోర్టుసిటీ, భాష్యం, అబాద్‌వీధి, కొత్తపేట కుమ్మర వీధి, బొందులగూడేంలో నగరపాలక సంస్థ పాఠశాలల్లో తనిఖీ నిర్వహించారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతి విద్యార్థులకు మాత్రమే నిర్వహించిన పరీక్షల వల్ల ఫైలేరియా పారాసైట్ లోడ్ గుర్తిస్తున్నామని తెలిపారు.

ప్రజా పోరాట యోధుడు సురవరం

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి ప్రజా పోరాట యోధుడని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. మంగళవారం స్థానిక అమర్ భవన్‌లో సుధాకరరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కామేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పాల్గొని, మాట్లాడారు. సుధాకరరెడ్డి మరణం భారతదేశ కమ్యూనిస్ట్ ఉద్యమానికే తీరని లోటన్నారు. వామపక్ష నేతలు బెహరా శంకరరావు, బుగత అశోక్, టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు దయానంద్, లోక్‌సత్తా పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజారావు పాల్గొన్నారు.


రైతులకు ఉద్యానశాఖ రాయితీలు

రాజాం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులకు ఉద్యాన శాఖ రాయితీలు అందిస్తుందని హార్టీకల్చర్ అధికారి ఉమామహేశ్వరి తెలిపారు. మంగళవారం బొద్దాం గ్రామంలో ఉద్యాన శాఖ, శ్రీనివాస ఆయిల్ మిల్ కంపెనీ రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను వివరించారు. రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలను ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ పంట వేసుకున్న మొదటి మూడేళ్లు అంతర పంటల నిర్వహణకు ఒక హెక్టార్‌కు రూ.10,500 రాయితీ ఇస్తామని చెప్పారు. ఈ విధంగా మొదటి నాలుగేళ్లు ప్రభుత్వం రాయితీ అందిస్తుందన్నారు. అలాగే ముదర ఆయిల్ తోటల్లో అంతర పంటగా కోకో పంటను సాగు చేసుకునేందుకు గాను హెక్టార్‌కి రూ.30వేల చొప్పున రాయితీ ఇస్తారని చెప్పారు. శ్రీనివాస ఆయిల్ మిల్ మేనేజరు వీరబాబు, సూపర్‌వైజర్ బాబీ, వీఏఏ జె.వినీత పాల్గొన్నారు.

జల కాలుష్యంపై విచారణ

రేగిడి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగార వ్యర్థ జలాల వల్ల మజ్జిరాముని పేటకు చెందిన రైతుల పంట పొలాలకు నష్టం వాటిల్లుతుందన్న ఫిర్యాదుపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ శ్యామల మంగళవారం విచారణ నిర్వహించారు. కర్మాగారాన్ని ఆనుకుని ఉన్న చెరువును ఆమె పరిశీలించి, నీటి నమూనాలను సేకరించారు. బాధిత రైతుల కష్ట నష్టాలపై ఆమె ఆరా తీశారు. జల కాలుష్య శాతాన్ని ల్యాబ్‌కు పంపించేందుకు తగు చర్యలు చేపట్టినట్టు ఆమె తెలిపారు.

పనిముట్లు ఇవ్వకపోతే పనులు బంద్ చేస్తాం


మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

రాజాం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు పనిముట్లు ఇవ్వకపోతే పనులు బంద్ చేస్తామని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సీహెచ్ రామూర్తినాయుడు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వద్ద ధర్నా నిర్వహించారు. పనిముట్లు అడిగితే తమను కొనుక్కోవాలని చెప్పడం దారుణం అన్నారు. అనంతరం శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేగొండి ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పడాల లక్ష్మి, అనీల్‌కుమార్, గురువులు, వైకుంఠవాసు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు అడ్డాగా..

(5వ పేజీ తరువాయి)

రూ. 90 లక్షలకు పైగా నిధులు పక్కదారిన పట్టినట్లు గుర్తించి మన్యం జిల్లా సహకార అధికారికి నివేదికలు అందించారు. ఈ మేరకు మంగళవారం విచారణ అధికారి ఆర్.రమణమూర్తి గరుగుబిల్లి పీఏసీఎస్ కార్యాలయంలో రుణాలు పొందిన రైతుల నుంచి సమాచారం సేకరించారు. సంఘం పరిధిలో సుమారు 1400 మందికి పైగా సభ్యులు ఉండగా.. ఇందులో 181 మందికి నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే 60 మందికి పైగా విచారణ నిర్వహించారు. అక్టోబరు వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. త్వరలో ఉన్నతాధి కారులకు పూర్తిస్థాయిలో నివేదికలు అందించనున్నారు. గతంలో సీఈవోగా విధులు నిర్వహించి మృతి చెందిన ఎన్.గుంపస్వామి సుమారు 31 మంది పేరుతో రూ. 85 లక్షలకు పైబడి నిధులు పక్కదారి పట్టించినట్లు సమాచారం ఉందని, ప్రాథమిక విచారణ తర్వాత ఎంతమేర నిధులు దుర్వినియోగమయ్యాయో తేలుతుందని విచారణ అధికారి వెల్లడించారు.

రెండు రశీదు పుస్తకాలు మాయం

గరుగుబిల్లి పీఏసీఎస్‌కు సంబంధించి రెండు రశీదు పుస్తకాలు మాయమయ్యాయి. ఒక్కో పుస్తకంలో 50 రశీదులు ఉంటాయి. ఒక రశీదు డీసీసీబీ బ్రాంచ్‌లో, మరొకటి రుణం పొందిన రైతు వద్ద మరో రశీదు పీఏసీఎస్‌లో ఉంటుంది. అయితే మాయమైన రశీదు బుక్ నెంబర్ల (1125002, 1126512, 112700)ను విచారణ అధికారులు గుర్తించారు. కాగా సంఘానికి రుణాలు చెల్లించి నట్లు రశీదులు అందించినా ఆ మొత్తాలు రికార్డుల్లో నమోదు చేయలేదు. కాగా జిల్లాలో 45,671 మంది పీఏసీఎస్ సభ్యులు ఉండగా 39,044 మందికి ఈకేవైసీ పూర్తయింది.

బోర్లు తవ్వారు.. హెడ్ బిగించడం మరిచారు

● ఆరు నెలలుగా నిలిచిన పనులు

మక్కువ రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మక్కువలో పైలట్ తాగునీటి ప్రాజెక్టు కింద తవ్విన బోరు బావులకు హెడ్‌లు బిగించలేదు. దీంతో నిర్దేశిత లక్ష్యం నెరవేరడంలేదు. మక్కువలో తాగునీటి సమస్య దృష్ట్యా బీసీ కాలనీ, కోమటి వీధి, రెల్లివీధిల్లో ప్రభుత్వం మూడు బోరు బావులను మంజూరు చేసింది. పార్వతీపురం ఐటీడీఏ ఒక్కో బోరు నిర్మాణానికి రూ. 5 నుంచి 6 లక్షలు మంజూరు చేసింది. బోరు నిర్మాణం పూర్తికాగానే ట్యాంకును ఏర్పాటు చేసి తద్వారా ప్రజలకు సాగునీటిని సరఫరా చేయాల్సి ఉంది. ఆయా కాలనీల ప్రజల అవసరాలను బట్టి కుళాయిలను కూడ ఏర్పాటు చేయాలి. అయితేబోర్లు తవ్వి ఆరు నెలలు దాటినా పనులు పూర్తి చేయకపోవడం వల్ల ప్రజలు తాగునీటి కోసం పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. బోర్ల నుంచి తాగునీరు ఎప్పుడు అందుబాటులోకి వస్తుందోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు. ● బోర్ల నిర్మాణం నిలిచిపోయిన విషయాన్ని ఐటీడీఏ ఏఈ పి.వి.సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా, తొందరలోనే పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇబ నిధుల విడుదలలో జాప్యం జరగడంతో పనులు ఆలస్యమయ్యాయన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తామన్నారు



ఎంఈవో కార్యాలయం పక్కన తవ్విన బోరు

డీపీఆర్వోకు డీడీగా పదోన్నతి

పార్వతీపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి, సహాయ సంచాలకులు లోచర్ల రమేష్ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా పదోన్నతి పొందారు. ఆయన్ని గుంటూరు జిల్లాకు నియమిస్తూ సమాచార శాఖ సంచాలకులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 1996లో ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా సహాయ పౌర సంబంధాల అధికారిగా నియామకమైన రమేష్ హైదరాబాద్, విశాఖపట్నం, పాడేరు, టెక్కలి, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. తాజాగా డీడీగా పదోన్నతి పొందడంపై పౌర సంబంధాల శాఖాధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

నానో యూరియా వాడకం మేలు

సాలూరు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంటలకు నానో యూరియా వాడకం వల్ల మేలు జరుగుతుందని మండల ప్రత్యేకాధికారి బి.రామారావు, తహసీల్దార్ కె.నీలకంఠరావు, ఎంపీడీవో జి.పార్వతి, ఏవో కె.శిరీష్ రైతులకు వివరించారు. జీగిరాం, తుండలో వారు మంగళ వారం పర్యటించారు. ఈ సందర్భంగా రైతులకు నానో యూరియా ప్రయోజనాలను వివరించారు. యూరియా విషయమై రైతులు ఆందోళన చెందవద్దన్నారు. రైతులకు అవసరమైన మేరకు యూరియాను అందించ డానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అలాగే జీగిరాం రైతు సేవా కేంద్రంలో 139 బస్తాలు, తుండలో 120 బస్తాల యూరియాను రైతులకు వారు పంపిణీ చేశారు.

యూరియా వాడకంపై అవగాహన

●గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): లుంబేసు, ఇరిడి పంచాయతీల్లో మంగళవారం యూరియా అవుట్ రీచ్ కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి, ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ నిర్వహించారు. రెండు గ్రామాల్లోని రైతులతో మాట్లాడారు. రైతులు ముఖ్యంగా గుళికలు రూపంలో యూరియా వాడడం మూలంగా చాలా నష్టం జరుగుతుం దన్నారు. 50 శాతం మాత్రమే మొక్కలకు అందుతుందన్నారు. మిగతా 50 శాతం భూమిలో మిగిలిపోతుందన్నారు. అదే నానో యూరియా ద్రవ రూపంలో ఉంటుందని, దీనిని వాడడం మూలంగా నేరుగా ఆకుల మీద పడి నష్టం లేకుండా మొక్కలు తీసుకుంటాయన్నారు. మండలానికి ఇప్పటివరకు 403 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. ఇంకా రెండు రోజుల్లో 75 మెట్రిక్ టన్నుల యూరియాను దుడ్డుఖల్లు, గొరడ, ఆమిటి, కేదారిపురం, కుక్కిడి, కొండవాడ రైతు సేవా కేంద్రాల్లో అందు బాటులో ఉంటుందన్నారు. కార్య క్రమంలో ఎంపీడీవో త్రివిక్రమరావు, తహసీల్దార్ శేఖరం, మండల వ్యవసాయాధికారి శంకరరావు, సచివా లయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల కోసం నిరసన

వీరఘట్టం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల జంక్షన్‌లలో మంగళవారం రైతులు ఎరువులు కోసం నిరసన తెలిపారు. రోడ్డును రైతులు దిగ్బంధించారు. వాహనాల రాకపోకలు నిలిచాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

శంకరరావుకు సత్కారం

పాలకొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత, సంస్కృత ఉపాధ్యాయుడు బౌరోతు శంకరరావును మంగళవారం పాలకొండ ఉపవిద్యాశాఖాధికారి పర్రి కృష్ణారావు సత్క రించారు. కార్యక్రమంలో పాలకొండ ఎంఈవో సోంబాబు ఉన్నారు.

కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టండి

పాలకొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి పాత బ్యారేజ్ కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ పనులు తక్షణమే చేపట్టాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి డిమాండ్ చేశారు. మండళవారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వానికి తోటపల్లి పనులపై ఆసక్తి లేదన్నారు. తోటపల్లి కుడి, ఎడమ ప్రధాన కాలువల హెడ్ షట్టర్లు పూర్తిగా శిథిలావస్థలో ఉన్నా మరమ్మతులు చేయడం లేదన్నారు. ఎడమ ప్రధాన కాలువలో వట్టిగెడ్డపై, పెద్దబుడ్డిడి గ్రామం వద్ద ఉన్న సైఫాన్ స్థానంలో అక్విడెక్ట్ ప్రతిపాదన అమలు చేయలేదన్నారు. ఈ సైఫాన్ దెబ్బతింటే వీరఘట్టం, పాలకొండ మండలాలకు నీటి సరఫరా నిలిచిపోతుందన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వమే ఆధునికీకరణ పనులు చేపట్టాలన్నారు.

భవన నిర్మాణం వేగవంతం చేయండి

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

కురుపాం, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణం వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం పరిశీలించారు. ఆసుపత్రి భవన నిర్మాణం రెండేళ్లుగా సాగుతుండటంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని కలెక్టర్‌కు ఆమె ఫోన్‌లో తెలియజేశారు. ఆ సమయంలో కలెక్టర్.. మొండెంఖల్‌లో పర్యటిస్తుండటంతో అక్కడ నుంచి వెంటనే కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. భవన నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఆసుపత్రి భవన నిర్మాణల మధ్యలో జాయింట్ సక్రమంగా కలవకపోవడంతో నీరుకారుతోందని తెలియజేయడంతో పరిశీలించి తన సెల్ ఫోన్ ఫొటో తీశారు. దాన్ని రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపిస్తానన్నారు. ఇకపై పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీసీహెచ్ డాక్టర్ నాగభూషణరావు, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్‌కుమార్, ఆసుపత్రి సూపరింటెడెంట్ డాక్టర్ సందీప్, తెలుగు యువత అధికారి ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, టీడీపీ మండల కన్వీనర్ కె.వి.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

యూరియా పూర్తిస్థాయిలో సరఫరా

పార్వతీపురం రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన యూరియాను పూర్తిస్థాయిలో ప్రభుత్వం సరఫరా చేస్తోందని, ఇందులో ఎటువంటి సందేహాలు వద్దని అధికారులు రైతులకు భరోసా ఇచ్చారు. మండలంలోని తాళ్లబురిడి, వెంకమ్మపేట గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి సుధారాణి, తహసీల్దార్ సురేష్, మండల వ్యవసాయాధికారి అశోక్ తదితరులు రైతులతో మంగళవారం ముఖాముఖి మాట్లాడారు. రైతులకు సరఫరా చేసిన యూరియా తదితర అంశాలపై చర్చించారు. భవిష్యత్తులో అవసరాల కోసం యూరియాను ఇప్పటి నుంచే నిల్వ ఉంచుకోవద్దన్నారు. రైతులకు ఇప్పటివరకు ఆయా గ్రామాల్లో అందించిన యూరియా వివరాలను గణాంకాలతో సహా మండల వ్యవసాయాధికారి అశోక్ వివరించారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రైతులతో సమావేశమైన అధికారులు

రైతులను కలిసిన అధికారులు

●పార్వతీపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యూరియా సరఫరాపై గ్రామాల్లోకి వెళ్లి రైతులను కలవాలని మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. దీంతో మంగళవారం జిల్లా వ్యాప్తంగా అధికారులు రైతులతో మాట్లాడేందుకు తరలివెళ్లారు. రైతులకు పూర్తిస్థాయిలో యూరియా చేరింది లేనిది ఆరా తీశారు. ఎరువుల పంపిణీపై రైతులు అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

ఎరువుల పంపిణీకి ఏర్పాట్లు

●సీతానగరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్ పంటల సాగుకు అవసరమైన యూరియా పంపిణీ చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని మండల ప్రత్యేకాధికారి, పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఇప్పలవలస రైతు సేవాకేంద్రంలో మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులకు అవసరమైన ఎరువులు పంపిణీ చేయడానికి సిద్ధం చేస్తున్నామన్నారు. ఏవో అవినాష్ మాట్లాడుతూ రెండు రోజుల్లో రైతులకు అవసరమైన యూరియా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో కుమారవర్మ, వ్యవసాయ, పీఏసీఎస్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో రోడ్ల నిర్మాణానికి కృషి

బెలగాం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానని రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ద్వారపురెడ్డి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్డీఏ కూటమిలో తన సేవలను గుర్తించి బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తున్న తనకు రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించిందన్నారు. ఇందుకు సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ద్వారపురెడ్డి

రైల్వే ట్రాక్ మరమ్మతులతో ఇబ్బందులు

కొమరాడ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళ వారం రైల్వే ట్రాక్ మరమ్మతులు పనుల వల్ల వాహనదారులు ఇబ్బం దులు పడ్డారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అర్థం రైల్వే గేట్ వద్ద ట్రాక్ మరమ్మతు పనులు రైల్వే అధికారులు ప్రారంభించారు. దీనితో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దాదాపు రెండు కిలోమీటర్ల మేర పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి.

రక్తహీనతకు గురికానివ్వవద్దు

సీతానగరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ఉషారాణి అన్నారు. ప్రసవ సమయంలో ఆసుపత్రుల్లో చేర్పించాలని సూచించారు. పలు గ్రామాల నుంచి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంల సహకారంతో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషారాణి 30 మంది గర్భిణులకు తనిఖీలు చేశారు. అవసరమైన మందులు పంపిణీ అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఎస్వీ రమణ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

'ఆదికర్మ యోగి'తో గ్రామాల అభివృద్ధి

కొమరాడ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆదికర్మయోగి అభియాన్‌తో గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో ఎస్.రమేష్ అన్నారు. మంగళవారం చినకెర్జల, బట్టిమేగవలస గ్రామాల్లో ఆది కర్మ యోగి అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించిర వీధుల్లో సమస్యలను గుర్తించారు. అనంతరం గ్రామసభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏపీవో భాను, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌరీశంకర్, డిప్యూటీ ఎంపీడీవో రాధాకృష్ణ పాల్గొన్నారు.

ట్రంప్ విధించిన పన్నులపై ఉద్యమించాలి

పాచిపెంట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంటలపై ట్రంప్ విధించిన దిగుమతి పన్నులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో రైతు సదస్సు నిర్వహించారు. అమెరికా నుంచి పత్తి దిగుమతిపై ఉన్న 11 శాతం పన్నును సున్నాకు తగ్గించడం వల్ల రైతులు తీవ్ర నష్టానికి గురవుతారన్నారు. గార్మెంట్స్ కంపెనీల్లో పనిచేస్తున్న ఆరు లక్షల మంది కార్మికులు, ఉద్యోగులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అలాగే వ్యవసాయ రంగాన్ని కాపాడటంలో అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. సదస్సులో రైతు సంఘం మండల కార్యదర్శి బోను గౌరునాయుడు, ఉపాధ్యక్షుడు బి.పాపయ్య, రైతులు లంకేన రామ్మూర్తి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు జన్ని రామయ్య, సీఐటీయూ నాయకులు కోరాడ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

విద్యార్థులు ఉన్నత స్థితికి చేరాలి

కురుపాం, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థితికి వెళ్లాలని జిల్లా వృత్తి విద్యా శాఖాధికారి (డీవీఈవో) వై.నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డేకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు సంస్కృతి, క్రీడారంగాలో కూడా అభివృద్ధి సాధించాలన్నారు. ఈ ఏడాది పరీక్షలలో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.కుమారస్వామి, చినమేరంగి ప్రిన్సిపాల్ రమణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీవీఈవో నాగేశ్వరరావు

పాలకొండలో అన్నదాత పోరు ర్యాలీ

పాలకొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళ వారం వైసీపీ నేతలు అన్నదాత పోరు ర్యాలీని నిర్వహించారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆధ్వర్యంలో వైకాపా శ్రేణులు, రైతులు ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో రైతులు ఎరువుల కోసం రోడ్డెక్కితే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణ మన్నారు. రైతులు ద్రోహి కూటమి ప్రభుత్వమన్నారు. ర్యాలీలో వైసీపీ నాయకులు దమలపాటి వెంకటరమణ, కనపాక సూర్య ప్రకాశరావు, వెలమల మన్మథరావు, కోరాడ సూర్యనారాయణ, లిల్లీ పుష్పనాథం తదితరులున్నారు.

ఎరువుల సరఫరాలో విఫలం

●బెలగాం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సరిపడే ఎరువులు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆరోపించారు. మంగళవారం పార్వతీపురంలో వైసీపీ అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం రాజన్న దొర, మాజీ ఎమ్మెల్యే జోగారావు పాల్గొన్నారు. స్థానిక వైఎస్ఆర్ విగ్రహం నుంచి ప్రభుత్వ ఆసుపత్రి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. దాంతో వారు రోడ్డుపై బైఠాయించారు. కొంతసేపు ట్రాఫిక్ జామ్ అయింది. అనంతరం 15 మందిని సబ్ కలెక్టర్ కార్యాలయానికి అనుమతించడంతో వారు వినతిపత్రం అందజేశారు.

సాగు ఖర్చు తగ్గించండి

పాచిపెంట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు ఖర్చు తగ్గిస్తూ అదనపు ఆదాయం పొందాలని సాలూరు సహాయ వ్యవసాయ సంచాలకురాలు సత్యవతి తెలిపారు. మంగళవారం మండలంలోని పి.కోనవలసలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎరువులు వినియోగం తగ్గించడం వలన భూమి సారవంతంగా ఉంటుందని, గట్లుపై అంతర్ పంటలు వేస్తే అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. అనంతరం బొబ్బిలివలసలో ప్రకృతి సేద్య రైతు మృత్యుంజయరావు తయారు చేసిన 600 లీటర్ల ఘన జీవామృతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రకృతి సేద్య అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలకు ఫ్యాన్ల వితరణ

కొమరాడ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఆర్తం పాఠశాల హెచ్‌ఎం కంచుమోజు రామ్మోహనరావు పుట్టిన రోజు సందర్భంగా అతడి శిష్య బృందం గిరిజన గ్రామాల్లోని పాఠశాలలకు 15 ఫ్యాన్లను మంగళవారం వితరణ చేశారు. మండల విద్యాశాఖాధికారులు జామి నారాయణస్వామి, గులిపల్లి చినతిరుపతిరావు చేతుల మీదుగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా శిష్య బృందం సేవలను రామ్మోహనరావు కొనియాడారు.

కూనేరుకు నైట్ హాల్ట్ బస్సు సౌకర్యం కల్పించండి



మాట్లాడుతున్న సాంబమూర్తి

కొమరాడ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నుంచి కూనేరకు నైట్‌హాల్ట్, పార్వతీపురం లంజి గ్రామం వరకు బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఎం నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. మంగళవారం కొమరాడలో ప్రయాణికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ పార్వతీపురం నుంచి కూనేరు మీదుగా లంజి గ్రామానికి, పార్వతీపురం నుంచి కూనేరుకు నైట్ హాల్ట్ బస్సు సౌకర్యం కల్పించి ప్రయాణికులు ఇబ్బందులు తొలగించాలన్నారు. ఈ నెల 21వ తేదీలోపు సమస్య పరిష్కరించాలన్నారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

ఆసుపత్రుల్లో సౌకర్యాలు కల్పిస్తాం

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి

జియ్యమ్మవలస, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల్లో సౌకర్యాలు కల్పించడంతో పాటు సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మంగళవారం ఆమె అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ముందుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చైతన్య మాట్లాడారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, పౌష్టికాహారం ఇస్తున్న తీరు, ఆసుపత్రిలో సమస్యలను వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆసుపత్రిలో డ్రైనేజీ వ్యవస్థ బాగోలేదని, ప్రహరీ లేదని, ఆసుపత్రికి వస్తున్న మార్గంలో లైట్లు లేని విషయం ఇప్పుడే తన దృష్టికి వచ్చిందన్నారు. డాక్టర్ల కొరత ఉందని తెలిసిందన్నారు. పెద్ద ఎక్స్‌రే యంత్రం కావాలని, పోస్టుమార్టం సేవలు ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్ల మరమ్మతుల విషయం తెలిసిందన్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించడంతో పాటు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబులో మాట్లాడి తప్పక నిధులు మంజూరు చేయిస్తానని భరోసా ఇచ్చారు. తాను అందుబాటులో లేకుంటే కమిటీ సభ్యుల తీర్మానంతో నిధులు ఖర్చుచేసి సమస్య లేకుండా చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చైతన్యను ఆదేశించారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ నాగభూషణరావు, ఎంపీపీ బొంగు సురేష్, అరకు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మూడడ్ల సత్యంనాయుడు, పీఏసీఎస్ చైర్మన్ రెడ్డి బలరామస్వామినాయుడు, కమిటీ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలే లక్ష్యం

పాలకొండ, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): సారా రహిత గ్రామాలుగా మార్చడమే లక్ష్యమని ఎంపీపీ బొమ్మాళి భాను, నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఆకుల మల్లీశ్వరి, తహసీల్దార్ రాధాకృష్ణ, ఇన్‌చార్జి ఎంపీడీవో పాలవలస మురళీధర్, ఎస్ఐ ప్రయోగమూర్తి, ఎక్సైజ్ ఈఐ కె.సూర్యకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నవోదయం 2.0 అమలుపై సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సారా నిర్మూలనకు ప్రభుత్వం నవోదయం 2.0 చేపట్టిందన్నారు. పాలకొండ మండలాన్ని ప్రత్యేకంగా తీసుకుని వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని రెండు సారా ప్రభావిత గ్రామాలను గుర్తించి సీ కేటగిరీలో ఉంచామన్నారు. ఆయా గ్రామాలకు ఒక్కో గ్రామానికి ఒక్కొక్క దత్తత అధికారులను నియమించామన్నారు. గ్రామ కమిటీలను ఏర్పాటు చేశామని వివరించారు.



మాట్లాడుతున్న అధికారులు

సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

పాలకొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.సూర్యకుమారి అన్నారు. మంగళవారం విలేకరులతో ఆమె మాట్లాడారు. నవోదయం 2.0 కింద వీరఘట్టం మండలంలో ఏడు గ్రామాలను గుర్తించి వాటిని బి, సి కేటగిరీలో పెట్టామన్నారు. బి-కేటగిరీలో బల్లగుడ్డి, గోర.. సి- కేటగిరీలో హుస్సేన్‌పురం, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, కొండవీధి, బట్టిగూడ గ్రామాలను సారా రహిత గ్రామాలుగా గుర్తించామన్నారు. కమిటీ సభ్యులుగా ఎంపీపీ, ఎక్సైజ్ సీఐ, తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్ఐ ఉంటారన్నారు.

బిటివాడ పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

వీరఘట్టం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయపార్వతి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పీఎంఎంఎస్ఎంఏ పథకం కింద నిర్వహిస్తున్న కార్యక్రమాలను సిబ్బందితో సమీక్షించారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ మహిళలతో మాట్లాడారు. అనీమియా యాక్షన్ కమిటీ సమావేశాల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ.మానస, ఏఎన్ఎం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

21 నుంచి దసరా సెలవులు ప్రకటించండి

సాలూరు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీలో దసరా సెలవులను సంప్రదాయానికి విరుద్ధంగా ప్రకటించారని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర సహ అధ్యక్షుడు జాగాన రామునాయుడు, పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి నాలి చంద్రశేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 21 మహాలయ అమావాస్య నుంచి సెలవులు ప్రకటించాలని కోరారు. తెలంగాణలో ఈ నెల 21 నుంచి వచ్చేనెల 3 వరకు దసరా సెలవులు ప్రకటించారని వివరించారు. ఏపీలో మాత్రం సంప్రదాయానికి విరుద్ధంగా ఈనెల 24 నుంచి వచ్చే నెల 2 వరకు సెలవులు ప్రకటించారన్నారు. దసరా ఉత్సవాలు ఏపీలోనూ అంగరంగ వైభవంగా జరుగుతాయన్నారు. ఏపీలో విజయవాడ కనకదుర్గ క్షేత్రం ఉందన్నారు. శరన్నవరాత్రోత్సవాలు మహాలయ అమావాస్య నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో సెలవులు ప్రకటనను ఏపీ విద్యాశాఖ సవరించాలని వారు కోరారు.